క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి ఆటో డ్రైవర్ల క్షీరాభిషేకం



రామారావుగూడెంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఆటోడ్రైవర్ల క్షీరాభిషేక దృశ్యం

దెందులూరు: ఆటోడ్రైవర్లు, వారి కుటుంబాల భద్రత, వారి భవిష్యత్తు అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శనివారం రామారావుగూడెం పంచాయతీ కార్యాలయంలో రామారావుగూడెం మేధినరావుపాలెం, చల్లచింతలపూడి సర్పంచులు పర్వతనేని శ్రావణి సుధీర్, మనుబోలు దుర్గాకుమారి రాజు, బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, రామారావుగూడెం వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, ఉపసర్పంచ్ కస్సే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాలుగు గ్రామాల ఆటో డ్రైవర్లు, యజమానులు క్షీరాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సర్ అంటూ ఆటోడ్రైవర్లు, ఓనర్లు నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తేరం ప్రసాద్, పర్వతనేని నరేంద్ర, బాబ్జి, ప్రసాద్, రామకృష్ణ స్వీట్లు పంచారు.

క్రీడా పోటీల్లో రామశింగవరం విద్యార్థుల ప్రతిభ

పెదవేగి: జిల్లా స్థాయి త్రోబాల్ ఎంపిక పోటీలో పెదవేగి మండలం రామశింగవరం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్ 14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో తణుకులో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్ 14 విభాగంలో పాఠశాలకు చెందిన చలమాల దివ్యశ్రీ, అండర్ 17 విభాగంలో దుక్కిపాటి సంజన ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ జమ్మా రామకృష్ణను శనివారం పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీ పద్మావతి ఘనంగా సత్కరించి అభినందించారు.

తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి



పాతూరులో మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులో శుక్రవారం రాత్రి జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.40 లక్షలతో నిర్మించిన మైక్రోవాటర్ ఫిల్టర్, పైపులైన్లను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. స్వచ్ఛమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ గ్రామంలో జలజీవన్ మిషన్‌లో రూ.లక్షలతో చేపట్టిన పనులు అనతికాలంలో పూర్తి చేసారన్నారు. దీనితో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ వెజ్జు బాలాజీ నాయుడు, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెజ్జు అన్నవరం, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు చిట్టూరి సాయి కృష్ణ, నాయకులు సింగలూరి సుభాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: సమస్యలు లేని కుటుంబాలు, గ్రామాలు ఏర్పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఎంపీటీసీ పులవర్తి వరమణి ఆధ్వర్యంలో సీతంపేట, కొత్తగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఉదయం 7 గంటలకు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని కార్యాలయ సిబ్బందితో నమోదు చేయించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ముస్లిం పెద్దలు, యువతతో ఎమ్మెల్యే మాట్లాడుతూ మసీదుకు ఇన్వర్టర్ అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఏలూరు పార్లమెంటరీ కార్యదర్శి పులవర్తి సంతోష్, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జోగన్నపాలెం సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, నాయకులు వలవల ఉదయ్‌భాస్కర్, వర్రె సత్తిబాబు, అధికారులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు కొమిరేపల్లిలో..

కొమిరేపల్లిలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి పులవర్తి సంతోష్, ఎంపీటీసీ పులవర్తి వరమణి, సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామని పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు.



కొత్తగూడెంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

కొమిరేపల్లిలో నేడు 200 గడప సంబరాలు : దెందులూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తయిన సందర్భంగా కొమిరేపల్లి కమ్యూనిటీ హాలులో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సమావేశం, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నాని తెలిపారు.

గడపగడపకూ సంక్షేమాన్ని అందించాం



రత్నాపురంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: గడప గడపకూ సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. కోరుకొల్లు పంచాయతీ శివారు కోరుకొల్లు, రత్నాపురం, బద్రికోడు, పైడిదిబ్బ గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వాసుబాబు వివరించి బ్రోచర్లను అందించారు. గుండుగొలను నుంచి కోరుకొల్లుకు వచ్చే రోడ్డును త్వరితగతిన నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ అర్హత గల ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించి ప్రతి ఇంటా వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరి గుండెల్లో పదిలంగా ఉన్నారన్నారు. సర్పంచ్ దాట్ల అన్నపూర్ణమ్మ, ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, ఎంపీటీసీ తోటకూర రామలింగరాజు, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, గుండుగొలను ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, లక్ష్మీపురం సర్పంచ్ దండు శ్రీను, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, నాయకులు నంద్యాల సుబ్బరాజు, జహీర్, వేములమంద రామరాజు, దాయం సుజాత, గొటికల మురళీ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, డిప్యూటీ తహసిల్దార్ షంషూద్దీన్, ఏఈ సుబ్రహ్మణం పాల్గొన్నారు.

‘గడపగడపకు’ ద్వారా ప్రజాసమస్యల క్షేత్రస్థాయి పరిశీలన



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దెందులూరు నియోజకవర్గంలో 200 రోజులు పూర్తి చేయడం తనకు సంతోషంగా కొత్త అనుభూతితో పాటు మరింత బాధ్యతను పెంచిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో 59 వేల గడపలు 200 రోజుల్లో పూర్తి చేశామన్నారు. ప్రతి రోజూ అనేక కుటుంబాల వద్దకు వెళ్లి వారిని ప్రత్యక్షంగా కలిసి సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకోవడం, నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా వారికి అందిన లబ్ధిని వివరించడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించిన ప్రజల కష్ట సుఖాలు, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసు కోవడంతో పాటు వారితో ప్రజాప్రతినిధులు మమేకమయ్యేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని అన్నారు. ప్రతి ఎమ్మెల్యే ఆ నియోజకవర్గంలో ప్రజల మధ్య ఉండేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అన్నారు. నియోజకవర్గం పరిధిలోని ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. 200 రోజులు పర్యటనలో వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల శ్రేణులు, అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నా వెన్నంటే ఉండి కుటుంబ సభ్యుడిగా ముందుకు నడిపిస్తున్నందుకు వారికి ఎమ్మెల్యే కొఠారు కృతజ్ఞతలు తెలిపారు.

కరాటే పోటీలో విజేతలకు అభినందనలు

దెందులూరు: మూడవ అంతర్జాతీయ ఆన్‌లైన్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విజేతలు కరాటే మాస్టర్ చింతాడి తేజబాబి ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిశారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నమెంట్‌లో 18 దేశాల నుంచి 2 వేలకుపైగా విజేతలు పోటీలో పాల్గొన్నారు. బంగారు పతకాలు సాధించిన కంకిపాటి నిహారిక, వై.బాలభార్గవి, కే.సింధూ, చింతాడి తేజబాబి, వెండి పతకాలు సాధించి డీ. శోభారాణి, పర్వతంసాయిరామ్, గుజ్జల దేదీప్య, గొట్రుశ్రావ్య భార్గవిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు గుత్తా ప్రసాద్ తదితరులు అభినందించారు.

రోడ్ల మధ్యలో విద్యుత్ స్తంభాలతో ప్రమాదాలు



బువ్వనపల్లిలో రోడ్డుపై విద్యుత్ స్తంభం



జగనన్న కాలనీలో రోడ్డుపై విద్యుత్ స్తంభం

నిడమర్రు: ప్రభుత్వం గ్రామాల్లో, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రహదారుల నిర్మాణాలు పూర్తి చేస్తోంది. ఈ సీసీ రహదారుల నిర్మాణంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు, మార్పు విషయంలో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బువ్వనపల్లిలో 2022లో గాంధీనగరం వీధిలో నిబంధనల ప్రకారం 10 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించారు. విద్యుత్ స్తంభం అడ్డుగా ఉందని ఆశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ అధికారులు రహదారి నిర్మాణం పూర్తి చేసారు. అడ్డుగా ఉన్న స్తంభానికి బదులు కొత్తగా మరో స్తంభాన్ని విద్యుత్‌శాఖాధికారులు ఏర్పాటు చేసి లైన్లు కలిపారు. ఏడాది నుంచి పాత స్తంభాన్ని తొలగించక ఆమార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయని బువ్వనపల్లి వాసులు అంటున్నారు. బువ్వనపల్లి నుంచి అడవికొలను వెళ్లే మార్గంలో బువ్వనపల్లి వద్ద సీసీ డ్రెయిన్ నిర్మిస్తున్నారు. దీంతో అడవికొలను, ఎనికేపల్లి వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఇదే మార్గంలో భయాందోళనకు గురవుతూ ప్రయాణిస్తున్నారు.

కాలనీలో తరచూ ప్రమాదాలు

బువ్వనపల్లి జగనన్న కాలనీలో 2021లో సీసీ రహదారి నిర్మాణంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని కలుపుకుని సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేసారు. రహదారి కొలతల్లో సీసీ రహదారికి నాలుగు అడుగులు లోపలకు కాలనీ ప్రధాన విద్యుత్ సర్వీస్ స్తంభం ఉండాలి. దీంతో అధికారులు ఈ స్తంభాన్ని రోడ్డు నిర్మాణం అనంతరం తొలగిస్తామని చెప్పి సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేసారు. నేటికీ అధికారులు ఆ స్తంభాన్ని తొలగించలేదు. ఈ స్తంభం వద్ద వాహదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీ వాసులు చెప్పారు. జులైలో గడపగడపకు మన ప్రభుత్వంలో కాలనీకి వచ్చిన ఎమ్మెల్యే వాసుబాబు సమస్యపై స్పందిస్తూ తక్షణం స్తంభాలను తొలగించాలని ఆదేశించినా విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు.

స్తంభాలను తొలగించేందుకు చర్యలు

గాంధీ నగరం వీధిలో అడ్డుగా ఉన్న పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ఇందిరమ్మ కాలనీలోని స్తంభం విషయంలో గ్రామ పంచాయతీ షిఫ్టింగ్ చార్జీలు చెల్లించిన తక్షణం విద్యుత్ స్తంభం స్థానం మార్పు చేసేలా చర్యలు తీసుకుంటాము.

– మురళీకృష్ణ, ఏఈ, విద్యుత్ శాఖ

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

- కొలువు దీరేందుకు దుర్గమ్మ విగ్రహాలు సిద్ధం
- ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు గ్రామాలు ముస్తాబయ్యాయి.. దుర్గాదేవి ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసారు. ఈ నేపథ్యంలో గ్రామ గ్రామాన అమ్మవారి విగ్రహాలు కొలువుదీరనున్నాయి. దీనితో విగ్రహాలు అమ్మకాలు జోరందుకున్నాయి. పూళ్ల, పోలసానిపల్లి, గుండుగొలను గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను తయారు చేస్తున్నారు. అంబర్‌పేట, పూళ్ల గ్రామాల్లో పర్యావరణ హిత అమ్మవారి విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేస్తున్నారు. పలు గ్రామాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. పూళ్లలోని కళాకారుడు యర్రవరపు బుల్లియ్య మాట్లాడుతూ ఇటీవల మట్టితో తయారు చేసిన దేవతామూర్తుల విగ్రహాలను మందిరాల్లో ప్రతిష్టిస్తున్నారని దీంతో వాటిని ఎక్కువగా తయారు చేస్తున్నట్టు తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాల ఆరంభం

ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు 10 రోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎం పురం, వడ్లపట్ల తదితర గ్రామాల్లో ఉత్సవాలను వైభోపేతంగా నిర్వహించేందుకు ఆలయ, ఉత్సవ కమిటీలు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజు అమ్మవారు భక్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. శనివారం చలువ పందిళ్ల వద్ద, ఆలయాల్లో ముందస్తుగా రాట పూజలు చేశారు.

దసరా సంబరాలకు సర్వం సిద్ధం



భీమడోలు: పూళ్లలో సిద్ధమైన పర్యావరణ హిత దుర్గమ్మ విగ్రహాలు



పెదవేగి: విద్యుత్ కాంతులతో రాట్నాలమ్మ దేవస్థానం



ఉంగుటూరు: విద్యుత్ కాంతులతో చల్లాలమ్మ ఆలయం

గణపవరం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. మండలంలోని పలు గ్రామాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే అమ్మవారి విగ్రహాలను ఆయా గ్రామాలకు చేరవేస్తున్నారు. గణపవరం కంచికామాక్షి కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కమిటీ చైర్మన్ తెలగారెడ్డి బాబి తెలిపారు. చినరామచంద్రపురం కనకదుర్గ ఆలయం, వైఎస్సార్ కాలనీ, సరిపల్లె కనకదుర్గ ఆలయం, పిప్పర, చిలకంపాడు, మొయ్యేరు, అర్ధవరం, కేశవరం, కొండేపాడు తదితర గ్రామాలలో దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి దేవీశరన్న నవరాత్రి ఉత్సవాలు

ఉంగుటూరు: దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలు ఉంగుటూరులో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలను ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొంటారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పత్తిపాటి దుర్గం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చల్లాలమ్మ ఆలయంలో గ్రామదేవత చల్లాలమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దూసనపూడి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ ఈవో కలగర శ్రీనివాసు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో కాపుల రామాలయం వద్ద, తూర్పు కాపు కనక దుర్గమ్మ ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

పెదవేగి : రాట్నాలమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఉదయం 8 గంటలకు వైభవంగా ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ చల్లగోళ్ళ వెంకటేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్ కుమార్ అన్నారు. పెదవేగి మండలం రాట్నాలగుంటలో ప్రసిద్ధిగాంచిన అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఉదయం కలశ స్థాపనతో ప్రారంభమవుతాయని నిర్వాహకులు చెప్పారు. ఈ నెల 15 నుంచి 23 తేదీ వరకు తొమ్మిది, రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఉంగుటూరు: ఫుడ్ విజిలెన్సు కమిటీ సభ్యుడు కోనే సత్యనారాయణ శనివారం కైకరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. స్టాకు పాయింటును, పరిసరాల పరిశుభ్రతను, పరిశీలించారు. చిన్నారులకు అందించేందుకు తయారు చేసిన ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు తోట దుర్గ, కనక మహాలక్ష్మి సహకరించారు.

కోడిపందేలపై దాడి

ఉంగుటూరు: ఎ.గోకవరంలో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై శనివారం దాడి చేసి పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,500 నగదు, కోడిపుంజులు, కత్తులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.